క్లుప్తంగా

యోగాతో ఆరోగ్యం

గుడ్లవల్లేరు: యోగా ఆరోగ్యంతో పాటు మానసి కోల్లాసం కలుగుతుందని గుడివాడ యోగ శక్తి సాధన సమితి డైరెక్టర్ డాక్టర్ ఎం.సత్యనారాయణ అన్నారు. యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు సాయం

చినముత్తేవి(మొవ్వ): మండలంలోని చినముత్తేవి గ్రామంలో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్నిప్రమాదంలో గృహాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మొవ్వ శాఖ సభ్యులు మంగళవారం చేయూతని అందజేశారు. చినముత్తేవి గ్రామానికి చెందిన గారపాటి పండుబాబు, గారపాటి వెంకటస్వామి కుటుంబాలకు సొసైటీ అధ్యక్షుడు, మండల తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయులు చేతుల మీదగా వంట పాత్రలు, వడ్డన పాత్రలు, హైజనిక్ కిట్టులతో పాటు 25 కేజీల రైస్ తదితరాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ జిల్లా కమిటీ సభ్యులు బెల్లంకొండ వెంకటేశ్వరరావు, వీఆర్వో సలీమున్నీసా బేగం, దోనేపూడి శివరామయ్య, కోనేరు రాజేంద్రప్రసాద్, మద్దాల కామేశ్వరరావు, గొరిపర్తి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

పామర్రు: ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న వీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. దాతలు కృష్ణామిల్క్ యూనియన్ జిల్లా బోర్డు డైరెక్టర్ బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి సౌజన్యంతో భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశామని ఆలయ ఈవో ఎల్‌సత్యవతి తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ మట్టా పూర్ణచంద్రరావు, కమిటీ సభ్యులు డీడీ ప్రసాద్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ టీ శ్రీనివాసరావు, నాయకులు బొమ్మారెడ్డి మాధవరెడ్డి, ఆలయసిబ్బంది పాల్గొన్నారు.

ఎలకుర్రు గ్రామ కార్యదర్శిగా పద్మ

పామర్రు: మండలంలోని ఎలకుర్రు గ్రామ కార్యదర్శిగా యు.పద్మ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మండవల్లి మండలం గన్నవరం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న పద్మ బదిలీపై ఎలకుర్రు వచ్చారు. ఎంపీడీవో వై.రామకృష్ణను కలిసి బాధ్యతలు స్వీకరించారు.

అంకితభావంతో పనిచేయండి

కైకలూరు : విద్యా వ్యవస్థలో అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు పొందాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. నూతనంగా కై కలూరు–2 ఎంఈవోగా విధుల్లో చేరిన వి.శ్రీనివాస్ ఎమ్మెల్యే నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. దొడ్డిపట్ల ప్రధానోపాధ్యాయులు కట్టా విష్ణుమూర్తి, ఉపాధ్యాయుడు బొర్రా శ్యామ్ సుందర్ పాల్గొన్నారు. అనంతరం ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ మేరీ నవరత్నకుమారిని ఎంఈవో శ్రీనివాసరావు కలిశారు.

పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన

కైకలూరు : వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్‌లో ప్రధాన రహదారి నుంచి నిర్మిస్తున్న తాగునీటి పైపులైన్ పనులకు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ విలేజ్‌లో నివాసితులందరికీ అన్ని మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సత్కారం

గుడివాడ టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో చాంపియన్‌షిప్ సాధించిన స్టేడియం క్రీడాకారులను మంగళవారం స్టేడియం కమిటీ హాలులో సత్కరించారు. ఈ సందర్భంగా స్టేడియం ఉపాధ్యక్షుడు పాలేటి శివసుబ్రహ్మణ్యం (చంటి) మాట్లాడుతూ గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన 10వ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తమ క్రీడాకారిణి ఎస్ వీర నాగుఅను 47 కిలోల శరీర విభాగంలో 172.5 కిలోల బరువును ఎత్తి బంగారు పతకం సాధించారన్నారు. మరో క్రీడాకారిణి గుదే సుభాషిణి 84 కిలోల విభాగంలో 230 కిలోల బరువును ఎత్తి వెండి పతకం సాధించారన్నారు. ఇంతటి విజయాన్ని సాధించిన క్రీడాకారులను, జిమ్ కోచ్ మార్సెల్ల వెంకటేశ్వరరావు, వెయిట్ లిఫ్టింగ్ అసిస్టెంట్ కోచ్ జంపా ఉషాకుమారిలను అభినందించారు. స్టేడియం సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ బొగ్గారపు తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ హక్కులకు వేలం

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ ఆలయ సన్నిధిలో అమ్మవారికి భక్తుల నుంచి వచ్చే మినుములు, ధాన్యం సేకరించుకునే హక్కుతో పాటు పార్కింగ్ హక్కులకు సంబంధించిన బహిరంగ వేలం నిర్వహించారు. మంగళవారం ఆలయ చైర్మన్ శేషం గోపి అధ్యక్షతన ఈఓ సురేష్ ఈ వేలాన్ని చేపట్టారు. రెండేళ్లకుగాను పెదనకు చెందిన ఆర్.నాగ ప్రసాద్ వాహనాల పార్కింగ్ హక్కును రూ.3.05 లక్షలకు దక్కించుకున్నారని ఈఓ సురేష్ తెలిపారు. ఒక్కో ధాన్యం బస్తా రూ.1,420, ఒక్కో మినుముల బస్తా రూ.8 వేలకు సేకరించుకునేందుకు వడ్లమన్నాడుకు చెందిన కె.కొండబాబు హక్కును దక్కించుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో ధర్మకర్తలు, పాటదారులు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్కూళ్లకన్నా మిన్నగా..

- జగనన్న ఆణిముత్యాలుకు సత్కారం
- హైస్కూల్ స్థాయిలో 1,2,3 స్థానాల్లో నిలిచినవారికి ప్రోత్సాహకాలు
- మెడల్స్ బహూకరణ



కనుమూరులో ప్రోత్సాహకాలను అందజేస్తున్న జెడ్పీటీసీ స్వరూపరాణి

కనుమూరు(పామర్రు): కార్పొరేట్ స్కూళ్లకన్నా మిన్నగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని పామర్రు జెడ్పీటీసీ కె.స్వరూపరాణి అన్నారు. మండలంలోని కనుమూరు గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఆణిముత్యాలు వంటి కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం పాఠశాల స్థాయిలో పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాలు సాధించిన వారికి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. హైస్కూల్ హెచ్‌ఎం.శారదకాంత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు టీ.శ్రీనివాసరావు, వై.పావని, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎండీ హస్మతుల్లా, మండల సచివాలయ కన్వీనర్ సురేష్ రెడ్డి, స్థానికులు వై.రవీంద్రబాబు, కె.సురేష్‌బాబు, ఉపాధ్యాయులు యానాదయ్య, కొడాలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ధైర్యాన్ని ఇస్తుందని వ్యవసాయ సలహా కమిటీ జిల్లా డైరెక్టర్ పెన్నేరు ప్రభాకరరావు అన్నారు. మంగళవారం వడ్లమన్నాడు జెడ్పీ హైస్కూల్లో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పతకాలను అందించారు.



అగినపర్రు హైస్కూల్‌లో సత్కారం పొందిన ఆణిముత్యాలతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు



వడ్లమన్నాడులో బహుమతులు పొందిన విద్యార్థులు శ్రీవల్లి, శారద, మాధురి

ప్రథమ స్థానం పొందిన ధాత్రి శ్రీవల్లీకి బంగారు పతకం, ప్రశంసా పత్రం, రూ.3 వేల నగదు బహుమతిని అందజేశారు. ద్వితీయ స్థానం పొందిన రాథోడ్ శారదకు సిల్వర్ పతకం, ప్రశంసా పత్రం, రూ.2వేల నగదు బహుమతిని అందించారు. తృతీయ స్థానం పొందిన సింగంశెట్టి మాధురికి కాంస్య పతకం, ప్రశంసా పత్రం, రూ.వెయ్యి నగదు బహుమతిని అందజేశారు. ఎంపీటీసీ మండా దిలీప్, సర్పంచి కటికల జ్యోతిలత, విద్యా కమిటీ చైర్మన్ జి.వెంకటేశ్వరరావు, హెచ్‌ఎమ్ కె.ప్రసాద్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పమిడిముక్కల: మండలంలోని అగినపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థులను ఆణిముత్యాలుగా గుర్తించి సత్కరించారు. ప్రథమ స్థానం పొందిన గరికె సాయిశృతికి బంగారు పతకం, ప్రశంసాపత్రం, రూ.3 వేలు, ద్వితీయ స్థానం పొందిన కొల్లూరి సౌజన్యకు సిల్వర్ పతకం, ప్రశంసాపత్రం, రూ.2 వేలు, తృతీయ స్థానం పొందిన కూడేటి లోశ్రితకు బ్రాంజ్ పతకం, ప్రశంసాపత్రం, రూ.వెయ్యి వంతున హెచ్‌ఎం ఫణికుమార్ చేతుల మీదగా అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లోనే ఆటపాటలతోకూడిన విద్య



మాట్లాడుతున్న సీడీపీవో భానుశ్రీ, కురుమద్దాలి సర్పంచ్ విజయభారతి

కురుమద్దాలి(పామర్రు): ఆటపాటలతో కూడిన విద్య అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతుందని ఐసీడీఎస్ పామర్రు ప్రాజెక్టు సీడీపీవో భానుశ్రీ పేర్కొన్నారు. మండలంలోని కురుముద్దాలిలో మంగళవారం అంగన్‌వాడీ పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో మాట్లాడుతూ మూడేళ్ల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. గ్రామ సర్పంచ్ గోట్రు విజయభారతి మాట్లాడుతూ చిన్నారుల అభ్యున్నతికి ప్రభుత్వం అంగన్‌వాడీల నుంచే అడుగులు వేస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయకుమారి, అంగన్‌వాడీ కార్యకర్త కె.విజయలక్ష్మి, డి.భవాని, ఆయాలు, చిన్నారులు తల్లులు పాల్గొన్నారు.



చోరగుడి అంగనవాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

ప్రాకర్లలో..

మండలంలోని ప్రాకర్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. సూపర్‌వైజర్ వాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, చిన్నారులు తల్లులు పాల్గొన్నారు.

పమిడిముక్కల: మండల పరిధిలోని చోరగుడి అంగనవాడీ కేంద్రంలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అంగనవాడీ పిలుస్తోంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి మాట్లాడుతూ 3 నుంచి 5 సంవత్సరాల వయస్సు కలిగిన చిన్నారులంతా అంగనవాడీలకు రావాలని తెలిపారు. అంగనవాడీలలో అందించే సేవలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారి, అంగనవాడీ కార్యకర్తలు, తల్లులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన

మండవల్లి : విద్యార్థులు మత్తుకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని నీతోడు మానసిక వికాస కేంద్రం (ఎన్ఐసీసీ) డాన్‌బోస్కో నవజీవన్ బాలభవన్ విజయవాడ కో ఆర్డినేటర్ టి.లీలావతి అన్నారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని భైరవపట్నం గ్రామంలోని యూపీ స్కూల్‌లో హెచ్‌ఎం ఎం.సుబ్రహ్మణ్యం అధ్యక్షతన విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. యువతీ యువకులను మత్తు పదార్థాల నుంచి రక్షిద్దాం మత్తు పదార్థాలు వద్దు.. ఆరోగ్యమే ముద్దు వంటి నినాదాలు విద్యార్థులతో పలికించారు.



మాట్లాడుతున్న నవజీవన్ బాలభవన్ కోఆర్డినేటర్ లీలావతి

ఉపాధ్యాయులు జి.సముద్రుడు, కె.వెంకటకృష్ణ పాల్గొన్నారు.

మల్టీ విలేజ్ స్కీమ్ భూముల పరిశీలన

గుడివాడ టౌన్(నందివాడ): మల్టీ విలేజ్ స్కీమ్ అమలుకు భూసేకరణ పనులు వేగవంతం చెయ్యాలని ఆర్డీఓ పి.పద్మావతి కోరారు. మంగళవారం ఆమె ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి నియోజకవర్గ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు రూ.160 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో జనార్ధనపురం సమీపంలోని పాములపాడు గ్రామానికి చెందిన 100 ఎకరాల్లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణానికి సేకరించిన భూముల సరిహద్దులను పరిశీలించారు. జనార్ధనపురం గ్రామంలో మల్టీ విలేజ్ స్కీమ్ ఫిల్టరేషన్ సముదాయం కొరకు 10.3 ఎకరాలు, తమిరిశ గ్రామ శివారు ఏబీ నగర్‌లో 30 సెంట్లు, రూరల్ మండలం మోటూరులో 30 సెంట్లు, రామనపూడిలో 30 సెంట్లు సేకరించామన్నారు. వాటికి సరిహద్దులు నిర్ణయించి త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఎంవీఎస్ఎన్ రాజు, ఏఈలు ఎ వెంకటేశ్వరరావు, రమేష్, అగ్రికల్చరల్ జాయింట్ డైరక్టర్ ఎన్ పద్మావతి, ఏడీఈ రమాదేవి, గుడివాడ, నందివాడ, పెదపారుపూడి తహసీల్దార్‌లు కె.ఆంజనేయులు, వి.భవన్నారాయణ, వి.నాగభూషణం, నందివాడ మండల వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ కె.కుమార్‌రెడ్డి, మండల వైస్ ఎంపీపీ జయరాజు తదితరులు పాల్గొన్నారు.



భూముల సరిహద్దులు పరిశీలిస్తున్న ఆర్డీఓ పద్మావతి, తదితరులు

ఘనంగా జాతీయ పఠన దినోత్సవం

గుడివాడ టౌన్: స్థానిక ఏఎన్నార్ కళాశాలలో జాతీయ పఠన దినోత్సవం మంగళవారం నిర్వహించారు. గ్రంథాలయాల్లో పుస్తక పఠనం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంబీఏ అధ్యాపకులు వి.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ పుస్తకాలు చదివే అలవాటు ఉంటే ఆయుష్షు రెండేళ్లు పెంచుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, లైబ్రేరియన్ బీఎస్ఎస్ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

వైఎస్సార్ బీమా సాయం అందజేత

గుడ్లవల్లేరు: ఆపదలో ఉన్న పేదలకు అండగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ బీమా అండగా ఉంటుందని పీఏసీఎస్ అధ్యక్షుడు దుగ్గిరాల శేషుబాబు అన్నారు. అంగలూరు గ్రామస్తుడు చప్పిడి నాగేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. మంగళవారం మట్టి ఖర్చుల సాయం కింద రూ.10 వేలను మృతుడి భార్య చప్పిడి సురేఖకు అందజేశారు. ఆ బాధిత కుటుంబానికి రూ.లక్ష వైఎస్సార్ బీమా మంజూరైనట్లు శేషుబాబు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి మేడపల్లి రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

యద్దనపూడి(మొవ్వ): అనారోగ్యంతో మృతి చెందిన మహిళ కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా రూ.10 వేల నగదును అధికారులు మంగళవారం అందజేశారు. మొవ్వ మండలం యద్దనపూడి గ్రామానికి చెందిన మత్తే శాంతి సోమవారం రాత్రి 10గంటల సమయంలో విజయవాడలో మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న వెల్ఫేర్ అసిస్టెంట్ సోమయాజుల శ్రీ రామాంజనేయులు, వలంటీర్ సునీల్ తదితరులు సాయం అందజేశారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న దాతలు

బార్లపూడి(మొవ్వ): చదివిన పాఠశాలను, ఉన్న ఊరుని మరువకుండా చేయూత ఇచ్చే దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అతిథులు సూచించారు. మంగళవారం మండలంలోని బార్లపూడి గ్రామ ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని 26 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు, పెన్నులు ఇతరాలను అందజేశారు. గ్రామానికే చెందిన పూర్వ విద్యార్థి, డెప్యూటీ తహసీల్దార్ గోవాడ సునీల్ కుమార్ తన తండ్రి గోవాడ ఆశీర్వాదం జ్ఞాపకార్థం వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు, పీఎంసీ చైర్మన్ గోవాడ సుబ్రమణ్యం, గ్రామస్తులు కిషోర్, బాలజీ, గోపాలస్వామి, వీరకృష్ణ, సీతారామయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు నేత పూర్ణయ్య వర్ధంతి

పామర్రు: గ్రామానికి చెందిన దివంగత కమ్యూనిస్టు నేత పూర్ణయ్య 18వ వర్ధంతి గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బందరు రోడ్డులో, స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద, శ్యామలాపురం, గుడివాడ రోడ్డు తదితర ప్రాంతాల్లో 105 మంది నిరుపేదలకు ఆహారపు పొట్లాలను పంపిణీ చేశారు. పూర్ణయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాడిశెట్టి సాంబశివరావు, పంచాయతీ సభ్యులు టీ కుమార్ యూత్ నేతలు సతీష్,పూర్ణయ్య కుటుంబ సభ్యులు సౌమ్యప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో–2గా పద్మరాణి

పామర్రు: ఎంఈవో–2గా గుమ్మడి పద్మరాణి మంగళవారం విధుల్లో చేరారు. పోరంకి జెడ్పీహైస్కూల్ గ్రేడ్–2 హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న పద్మరాణి బదిలీపై పామర్రు మండల విద్యాశాఖ అధికారి–2గా నియమితులయ్యారు. ఇక్కడ ఎంఈవోగా పనిచేసిన పీ విజయలక్ష్మిని విజయవాడ ఈస్టుకు ఎంఈవో–2గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పద్మరాణి మాట్లాడుతూ ఉపాధ్యాయుల అందరి సహకారంతో ఉత్తమ మండలంగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తానని అన్నారు. ఎంఈవోను ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు పుష్పగుచ్ఛాలతో ఆహ్వానం పలికారు.

ప్రాథమిక పాఠశాల తనిఖీ

పమిడిముక్కల: మంటాడ (మెయిన్) ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ–2 ఎస్.శ్రీనివాస్ మంగళవారం తనిఖీ చేశారు. హెచ్‌ఎం ఆర్.ప్రకాశకుమారిని వివరాలు అడిగి తెలుసుకొన్నారు. రిజిస్టర్‌లు పరిశీలించారు. రాగిజావను రుచి చూశారు. మెనూను పరిశీలించారు. వంటగది, ఆర్వో ప్లాంట్‌లను పరిశీలించారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ–2 శ్రీనివాస్

వైభవంగా జగన్నాథుడి రథయాత్ర



ఆలయ స్వాగత ద్వారం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్ : వడాలి శ్రీజగన్నాథస్వామివారి రథయాత్ర మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆషాఢ విదియ తిథి సందర్భంగా రథయాత్రను ప్రారంభించారు. ఈ రథయాత్ర గ్రామంలో ముదినేపల్లి బస్టాండ్ సెంటర్ వరకు తిరిగి 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయం వరకు కొనసాగింది. తిరిగి వడాలి జగన్నాథస్వామి ఆలయానికి చేరుకుంది. ఈ రథయాత్రను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఆలయ చైర్మన్ మర్రివాడ సుబ్బలక్ష్మి, వీరారెడ్డి దంపతులు పూజలు చేసి ప్రారంభించారు. రథయాత్రకు దారి పొడవునా భక్తులు ఘనస్వాగతం పలికి హారతులిచ్చారు. ఆలయ చైర్మన్ దంపతులు సొంత ఖర్చుతో నిర్మించిన ఆలయ స్వాగత ద్వారాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ రథోత్సవం, స్వాగతద్వారం ప్రారంభం కన్నులపండువగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాలకు పరిసర గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం – చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి మంగళవారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి పుట్టలో పాలుపోసి స్వామిని దర్శించుకుని అభిషేకాలు చేయించుకున్నారు. ప్రధాన అర్చకుడు తోలేటీ వీరభద్రశర్మ ఆధ్వర్యంలో ఈ అభిషేకాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ శొంఠి నాగరాజు, సహాయ కమిషనర్ నేల సంధ్య, పాలకవర్గ సభ్యులు పర్యవేక్షణ చేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మండవల్లి : మండలంలోని కొవ్వాడలంక గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన నిధులతో సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రహదారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారన్నారు. రాకపోకలు సాగించటానికి ప్రజలకు ఎలాటి ఇబ్బందులు లేకుండా రోడ్లకు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము) సర్పంచ్ జయమంగళ తిరుపతి వెంకన్న, ఉప సర్పంచ్ మోరు కృష్ణమోహన్, ముంగర మల్లిఖార్జునరావు, చావలిపాడు శ్రీను, ముంగర జయబాబు, ముంగర రంగారావు, ముంగర సత్యనారాయణ, జయమంగళ కృష్ణ, జయమంగళ శ్రీను, ముంగర సాంబశివరావు, రాజు, ఏఈ సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంట సాగు హక్కుపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, పక్కన ఏవో నాగేశ్వరరావు

గుడ్లవల్లేరు: పంట సాగు హక్కు పత్రాలపై రైతులకు అవగాహన అవసరమని తహసీల్దార్ అబ్దుల్ రెహామ్‌న్ మస్తానా అన్నారు. వడ్లమన్నాడు ఆర్బీకేలో మంగళవారం పంట సాగు హక్కు పత్రాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. భూ యజమానికి ఏ విధమైన ఇబ్బంది లేకుండా సాగుదారుడికి సాగులో వచ్చే నష్టాలను, పంట ఉత్పత్తులను నేరుగా ఆర్బీకే ద్వారా విక్రయించుకోవచ్చన్నారు. ఇందుకు సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అవకాశం కల్పించిందని వ్యవసాయ సలహా కమిటీ జిల్లా డైరెక్టర్ పెన్నేరు ప్రభాకరరావు అన్నారు. ఏఓ సునీల్, ఎంపీటీసీ మండా దిలీప్, సర్పంచి కటికల జ్యోతిలత, ఆర్.ఐ బేగం, వీఆర్వో భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పామర్రు(తోట్లవల్లూరు): కౌలు రైతులందరికీ పంట సాగు హక్కు పత్రాలు ఎంతో ఉపయోగపడతాయని ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి అన్నారు. తోట్లవల్లూరు–1 డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం వద్ద కౌలు రైతుల గుర్తింపు కార్డులపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఇదిరైతుల ప్రభుత్వమని ముఖ్యమంత్రివైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతుల బాగుకు ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారన్నారు. ఎంఏవో జీ నాగేశ్వరరావు, మండల ఉద్యాన శాఖ అధికారి చందు జోసెఫ్ సుందరం వీఆర్వో దువ్వూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పమిడిముక్కల: మండలంలోని తాడంకి సచివాలయంలో కౌలు రైతుల గుర్తింపు కార్డులు పంపిణీ ప్రారంభించారు. ఏవో గణేష్‌రెడ్డి, సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, ఎంపీటీసీ కూచిపూడి శ్రీలక్ష్మి కౌలు రైతులకు గుర్తింపు కార్డులను మంగళవారం అందజేశారు. ఏవో గణేష్‌రెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులకు ఇచ్చే గుర్తింపు కార్డులతో భూయజమానులకు ఏవిధమైన ఇబ్బంది ఉండదన్నారు. 11 నెలలు మాత్రమే గుర్తింపు కార్డు పనిచేస్తుందని చెప్పారు. వీఏఏ కావ్య, వీఆర్వో వాసు, రైతులు పాల్గొన్నారు.

కూచిపూడి(మొవ్వ): కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులకై ఆయా గ్రామాల వీఆర్‌వోలను సంప్రదించాలని తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయప్రసాద్ సూచించారు. మండలంలోని కూచిపూడి సచివాలయం వద్ద మంగళవారం పంటసాగుదారు హక్కు పత్రాల (సీసీఆర్‌సీ కార్డుల)పై అవగాహన, ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూ యజమానులు ఏ విధమైన అపోహలకు పోకుండా కౌలు రైతులకు సహకరించాలన్నారు. సీసీఆర్‌సీ కార్డులు కేవలం 11 నెలలకు మాత్రమే వ్యాలిడిటీ ఉటుందన్నారు. ఏవో కే శివకుమార్, వీఆర్‌వో ఖాసిమ్, వీఏఏ జే కుమార సోమేశ్వర్, అమర బాలేశ్వరరావు పాల్గొన్నారు.

పాడి రైతులకు పశు బీమా వరం

ఏలూరు జేడీ నెహ్రూబాబు

కైకలూరు : వైఎస్సార్ పశు బీమా పథకం పాడి రైతులకు వరం వంటిదని ఏలూరు జిల్లా పశుసంవర్థక జేడీ నెహ్రూబాబు అన్నారు. కై కలూరు వెటర్నరీ కార్యాలయంలో ఏడీ ముస్తాపాఖాన్ అధ్యక్షతన బుధవారం రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జేడీ మాట్లాడుతూ పశువులకు మూడేళ్ల కాలానికి కేవలం రూ.384 చెల్లించి పశు బీమా పొందాలన్నారు. దీంతో పశువు మరణిస్తే రూ.30,000 ఇన్సూరెన్స్ సాయం అందుతుందన్నారు. గొర్రెలు, మేకలు, పందులకు ఏడాదికి రూ.36, రెండేళ్లకు రూ.54, మూడేళ్లకు రూ.87 చెల్లిస్తే మరణించిన ఒక్కో జీవానికి ఇన్సూరెన్స్ నిమిత్తం రూ.6,000 దక్కుతుందన్నారు. పశు బీమా పథకం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏలూరు డివిజన్ డెప్యూటీ డైరెక్టరు రామచంద్రరావు, పశువైద్యులు నాగేంద్రవర్మ, ఫణీంద్రబాబు, ప్రహర్ష, పాడి రైతులు, పశుసంవర్థకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



పశు బీమా పథకం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేడీ, అధికారులు

శ్మశాన వాటిక స్థల సేకరణకు రూ.5 కోట్లు మంజూరు

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన ఎస్సీ నేతలు

గుడివాడ టౌన్: దళితుల శ్మశాన వాటికకు భూసేకరణలో ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) చేసిన కృషి అభినందనీయం అని ఎస్సీ నాయకులు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే కొడాలి నానిని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శ్మశాన వాటిక స్థల సేకరణకు వైఎస్ జగన్ మోహనరెడ్డిని ఒప్పించి రూ.5 కోట్లు నిధులు విడుదల చేయించడంతో దళితుల సమస్యలపై ఎమ్మెల్యే చిత్తశుద్ధిని తెలియచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీసెల్ పట్టణ అధ్యక్షుడు రేమల్లి నీలాకాంత్, వెంపటి సైమన్, విక్టర్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు